కథా నిలయం
శ్రీకాకుళం





# విజ్ఞుడు

'ఛీ' అనుకున్నాడు ఆనందరావు

కొందరు అనుకున్న మాటల్లా పైకి అనెయ్యలేరు. ఒక్కొక్కప్పుడు.

అలాగే ఆనందరావూ అనలేదు, అనలేదు కూడా.

అందుకని...

అసహ్యంతో మొహం పక్కకి త్రిప్పుకున్నాడు.

కాని... కాని

అరెరె... అదేమిటి? అక్కడ ఆ పక్కన కూర్చున్నవాడు కూడా వీడిలాగే...

పల్లెటూరి బైతులా...

ఒకటో క్లాసు కుర్రెధవలా...?

ఆరోగ్య సూత్రాలేమీ తెలియని... అజ్ఞానిలా...

వాడూ వీడిలాగే ప్లేటులోనే చేయి కడుక్కుంటున్నాడు.

దోసెలో నంజుకోగా మిగిలిన కాస్త పచ్చడీ చేతిలోకి తీసుకొని, వ్రేళ్ల సందున నలిపి చేతి కంటుకున్న నూనె వదిలించుకుని మరీ కడుక్కుంటున్నాడు.

"ఛీ"అనుకున్నాడు ఆనందరావు మళ్ళీ వాణ్ణీ, తనెదురుగా కూర్చుని జేబురుమాలుతో చేయి తుడుచుకుంటూ తృప్తిగా త్రేనుస్తున్న వీణ్ణీ అసహ్యంగా చూస్తూ.

అయితే ఇందాకటంత గట్టిగా అనుకోలేదు ఆనందరావు.

మాసిన పొట్టి నిక్కరూ, బనియనూ తొడుక్కుని జిడ్డోడుతున్న కుర్రాడొకడు వచ్చి ఆ నీళ్లతో నిండిన ప్లేట్లు తీసి టేబుల్ తుడిచి లోపలికి పోతున్నాడు.

వాడు టేబుల్ తుడవడానికుపయోగించిన గుడ్డను చూస్తేనే డోకు వచ్చేట్టుందనుకున్నాడు ఆనందరావు.

కాని, ఎప్పుడూ అనుకున్నదల్లా జరగనట్లుగానే ఇప్పుడూ ఆనందరావు డోక్కోలేదు.

'ఎబ్బే. ఏం మనుషులు వీళ్ళు? ' అనుకున్నాడు ఆనందరావు, ఆ హోటల్లో తింటూ త్రాగుతూ వున్నవాళ్ళలో తనని తప్ప అందర్నీ కలియజూస్తూ.

"వీళ్ళకేం తాము చేస్తున్న పనులు మంచివికావని తోచదా. వీళ్ళింత మూర్ఖులా? "

అలా అనుకోవటంతో తాను వాళ్ళందరికన్నా ఓ మెట్టుపైనున్నట్లనిపించింది ఆనంద రావుకు.

ఈ ప్లేటు తీసుకెళ్ళిన కుర్రాడు వాటిమీద ఓ నాలుగు చుక్కల నీళ్ళు జల్లి ఆహా ఎంత బాగా శుభ్రం చేశాను అనుకుంటాడు. అనుకుని, వాటిని సర్వరుకందిస్తాడు. వాడందులో ఓ దోసో, రెండిడ్లీలో వేసి తన బోటివాళ్ళ ముందుంచుతాడు. తామేమో లొట్టలు వేసుకుంటూ మ్రింగి ఊరుకుంటారు, మడ్డి సంగతీ, జిడ్డు సంగతీ చూడకుండానే.

అయినా వీళ్ళకు బుద్ధిలేకపోతే, వాడికన్నా ఉండనక్కర్లేదా.

అందరూ వీళ్ళలాంటి వెధవాయలేనా? తనబోటి అన్నీ తెలిసినవాళ్ళు లేరా?

ఆ సంగతి వాడు గమనించవద్దా?

అనుకుంటూనే తలెత్తాడు ఆనందరావు.

గోడమీది బోర్డును చూసి ఉలిక్కిపడ్డాడు.

"దయచేసి ప్లేట్లలో చేతులు కడగకండి"

హోటలు వాడిని అనవసరంగా తిట్టుకున్నందుకు తనమీద తనకే జాలి వేసింది ఆనంద రావుకు. పాపం హోటల్‌వాడి తప్పేం లేదు. వీళ్ళకే, ఈ తిని, కడిగి, త్రాగేవాళ్ళకే బుద్ధి లేదు. లేకపోతే గోడమీది ఆ బోర్డు అంతగా మొత్తుకుంటున్నా చూడకుండా పట్టించు కోకుండా యీ గలీజేమిటి?

సర్వర్ తెచ్చి ముందుంచిన ప్లేటులోని దోసెలోంచి వేడి ఆవిరి మొహాన తగలటంతో ఆలోచనలు ఆగిపోయాయి ఆనందరావుకు.

దోసె చాలా రుచిగా ఉందనుకున్నాడు, ఆకలిగా ఉన్న ఆనందరావు, మూడు ముక్కలు నమిలాక.

అయినా అయ్యారుగాడు వండటమూ, అవి బాగుండకపోవడమూ ఏమిటి? ఇడ్లీ వండితే వాడే వండాలి. దోసె చేస్తే వాడే చెయ్యాలి. సాంబార్ కలిపితే వాడే కలపాలి. "వింటే భాగ వతమే వినాలి, తింటే అయ్యారిడ్లీయే సాంబర్తో సహా తినాల"ని సామెత ఊరికే పుట్టిందా మరి. అందుకే వందల మైళ్ళు దాటివచ్చినా ఇక్కడ ఇలా హాయిగా టేబుల్ ముందు కాళ్ళు బారజాపుక్కూర్చుని రెండు చేతులా సంపాదిస్తున్నాడు.

అయ్యారు అదృష్టాన్ని మెచ్చుకుంటూ దోసె తినటం ముగించి, కాఫీకి ఆర్డరిచ్చి వాష్ బేసిన్ వైపు నడిచేడు ఆనందరావు.

వాష్‌బేసిన్‌ను సమీపిస్తూ "నో అడ్మిషన్!" బోర్డు క్రిందున్న ద్వారం గుండా కనిపించిన దృశ్యాన్ని చూసి మళ్ళీ "ఛీ!" అనుకున్నాడు ఆనందరావు.

లోపలంతా మసిబారిన నల్లగోడలూ, చెమటోడ్చే మురికి మనుషులూ, పొగతో నిండిన వేడిగాలి.

తానిందాక తిన్న దోసె యీ మురికికూపంలోనేనా తయారయింది? తాను త్రాగబోతున్న కాఫీ వీళ్ళ చేతుల్లోనేనా తయారవుతున్నది?

ఆనందరావు మనసు చివుక్కుమన్నది.

మొహం త్రిప్పుకుని వాష్ బేసిన్ వద్దకు చేరుకుని, అందులో చేయి పెట్టి, రెండో చేత్తో పంపు త్రిప్పేడు ఆనందరావు. కాని అందులోంచి నీళ్ళు రాలేదు. రెండో వైపునున్న పంపు త్రిప్పేడు. అదీ అంతే.

విసుగ్గా కోపంగా కౌంటరుముందున్న అయ్యారు వంక చూసేడు. కాని అయ్యారు దృష్టి

ఇటు లేదు. బిల్లులు చూసుకుంటూ చిల్లర డబ్బు లెక్క పెట్టుకుంటున్నాడు తాపీగా.

యధాస్థానానికొచ్చి కూర్చుని, అప్పుడే ప్లేటూ, గ్లాసూ తీసి టేబుల్ శుభ్రం చేయబోతున్న కుర్రాడినాపి, గ్లాసులో మిగిలిన కాసిని నీళ్ళతో ఆ ప్లేటులోనే చేయి కడుక్కుని, కాఫీ త్రాగేశాడు ఆనందరావు.

కాఫీ మహా రుచిగా వుంది. కాఫీ ఇలా వుండాలని తాను ఇంట్లో ఎన్నిసార్లు చెప్పినా లాభం లేకపోయింది. ఇంట్లో త్రాగుతున్నప్పుడు అసలు కాఫీ త్రాగుతున్నట్లే ఉండదు తనకు. ఏదో వెలితిగానే ఉంటుందెప్పుడూ.

బహుశా యీ హోటలువాళ్ళ దగ్గర ఏదో చిట్కా ఉండి ఉండాలి. లేకపోతే ఇంత రుచి ఎలా వస్తోంది?

ఆనందరావు లేచి బిల్లు చెల్లించి, బయటికి వచ్చి, పాన్‌షాపు వేపు నడిచేడు.

పాన్‌షాపు ముందు మూగిన వాళ్ళలోంచి కాస్త సందు చేసుకుని పాన్‌కు ఆర్డరిచ్చి, యధాలాపంగా పాన్ కట్టేవాణ్ణీ, వాడు కడుతున్న తీరూ చూసి గతుక్కుమన్నాడు ఆనందరావు.

వాడు పాన్ నములుతూ బాసింపట్టు వేసుక్కూర్చుని ముందు పరచిన గుడ్డమీద ఆకులు పరచి ఒక్కసారిగా అరడజను పానులు చకచకా తయారుచేస్తున్నాడు.

అయితే ఆనందరావు గతుక్కుమన్నది వాడి నైపుణ్యాన్ని గాని, అతగాడి పెదవుల మధ్య నృత్యం చేస్తున్న పాన్ తాలూకు రక్తంలాంటి నురగనుచూసి కాని కాదు. అది బాగా పరిచయమైన మొహమేనాయె.

వాడు ఆకులు పరచిన గుడ్డను చూసి "ఛీ!" అనుకున్నాడు ఆనందరావు.

వాడా గుడ్డను ఎన్నాళ్ళనుంచి వాడుతున్నాడో గాని అది సగం ఎర్రగా, సగం నల్లగా అలుముకుపోయి ప్రస్తుత స్థితిలో చూట్టానికి మసిపాతలా వుంది.

అయితే ఆనందరావు "ఛీ" అనుకున్నది ఆ గుడ్డ అంత అందంగా ఆధునిక కళాఖండంలా ఉండటాన్ని చూసి భరించలేకగాదు.

మరో క్షణంలో తన నోట్లోకి పోబోతున్న పాన్ ఆ మాసిన మరకల మురికిగుడ్డ మీద తయారవటాన్నే సహించలేకపోయాడు ఆనందరావు.

పాన్ కోసం అక్కడ మూగిన నలుగుర్నీ పరకాయించేడు. వాళ్ళెవరూ ఆ సంగతి గమనించినట్లే లేరు. కళ్ళు తెరుచుకుని చూస్తూనే మురికిని మ్రింగటానికి సిద్ధపడుతున్నారు వీళ్ళు.

"ఎబ్బే ఏం మనుషులు!" అనుకున్నాడు ఆనందరావు.

అలా అనుకోవటంతో "వెధవ పాన్! వేసుకోకపోతేనేమి! వెళ్ళిపోదామా" అనిపించింది.

కాని, అంతకుముందే డబ్బు వాడి ఎదాన కొట్టిన సంగతి గుర్తుకొచ్చి ఆగిపోయేడు.

వెధవది, తాను ముందుగానే డబ్బెందుకివ్వాలి! ఇదో పాత అలవాటైపోయింది. ఇప్పుడు పాన్ అక్కర్లేదు. ఆ పైసలు యిచ్చెయ్యమంటే పిచ్చాణ్ణి చూసినట్లు చూస్తారు నలుగురూ. కనుక ఇప్పుడు మర్యాదగా ఆ పాన్ పుచ్చుకుని తర్వాత ఏ చెత్తకుండీలోనో పడేస్తే సరి! మళ్ళీ ఇటు రాగూడదు." అనుకున్నాడు ఆనందరావు.

అనుకుంటూనే షాపువాడందించిన పాన్ పుచ్చుకుని నాలుగడుగులు ముందుకు వేసేడు.

"గుడీవ్నింగ్!" అంటు ఎదురయ్యేడు స్నేహితుడు సూర్యనారాయణ చేయి చాపుతూ.

చేయందించబోయి చేతిలోని పాన్‌ను చూసి దాన్నే అందించబోయేడు ఆనందరావు.

'ఎబ్బే! నాకు అలవాటు లేదు. అయినా పాన్ వంటికి ఏమంత మంచిదిగాదంటారు.

దానివల్ల గుండెజబ్బులు, కాన్సర్ గట్రా వచ్చే అవకాశముందటగా!" అన్నాడు సూర్యనారాయణ.

అని, చేతిలోని బరువైన సంచీని పట్టుకోమని ఆనందరావుకిచ్చి, జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించేడు.

సూర్యనారాయణ మాటలకు మండుకొచ్చింది ఆనందరావుకు.

'వీడి బొంద! కాకపోతే సిగరెట్లలో అమృతముంది కాబోల్ను! అది మాత్రం గుండెలకు బలంగాబోల్ను' అనుకుంటూనే కోపంగా చేతిలోని పాన్‌ను చూసి, అమాంతం నోట్లో వేసుకుని సూర్యనారాయణనే నమిలివేస్తున్నట్లు పరపరా నమలసాగేడు.

"ఏమిటి కబుర్లు? " ప్రశ్నించేడు సూర్యనారాయణ.

"ఏముంది? ప్రపంచమంతా అధ్వాన్నంగా తగలబడుతోంది!" అన్నాడు ఆనందరావు. పాన్‌నూ, పాన్ షాపువాణ్ణీ, హోటలువాణ్ణీ నెమరువేస్తూ.

"అవును, తగలబడుతూంది!" వంత పలికాడు సూర్యనారాయణ. 'ఈ సంచీలోచూడు' అన్నాడు.

ప్రపంచం ఇందులోనే తగలడుతోందేమోననుకుంటూ సంచీలోకి చూసిన ఆనందరావుకు అందులో తెల్లగా, తియ్యగా మెరుస్తూన్న పంచదార తప్ప మరేం అగుపించలేదు.

"ఏముంది! పంచదార" అన్నాడు ఆనందరావు, సంచీని సూర్యనారాయణనూ మార్చి మార్చి చూస్తూ.

అవును. పంచదారే! ఇంత తెల్ల వస్తువు కూడా నల్లమార్కెట్లో తప్ప దొరకటంలేదు. ఇప్పుడక్కణ్ణుంచే కొనుక్కొస్తున్నాను. అంటే ప్రపంచం ఎంత నల్లగా తగలడుతూందో ఆలోచించు' అన్నాడు సూర్యనారాయణ.

అని, "ఇలా ఎక్కడికి బయలుదేరేవు? " అని ప్రశ్నించేడు ఆనందరావుని

'ఎబ్బే! అలా కాస్త సినిమా చూసొద్దామని" నసిగేడు ఆనందరావు. వీడు కూడా వస్తానంటాడేమోనని భయపడుతూ.

'కాస్తేం ఖర్మ! పూర్తిగా చూడు. టైమయిపోతున్నట్టుంది. త్వరగా వెళ్ళు. నాకు మార్కెట్లో పనుంది" అంటూ వెళ్ళిపోయేడు సూర్యనారాయణ.

"వెధవ!" అనుకున్నాడు ఆనందరావు. పూర్తిగా చూడాలట. ఆ సంగతి వీడు చెప్పాలిగాబోల్ను! అయినా వీడిలాంటి చవటలుండబట్టే పంచదారలాంటి తెల్ల వస్తువులు కూడా నల్ల మార్కెట్లోకి జారుకుంటున్నాయి. లేకపోతే ఓ వారంపాటు కాఫీ మానుకోగూడదూ! అప్పుడు పంచదారా, దాని తాతా కూడా తెల్ల మార్కెట్లోకి రాకేం చేస్తాయి! అసలు బ్లాక్ మార్కెట్లో కొనే వీడిలాంటి మనుషలే ఆ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఛీ! ఛీ! … ఎబ్బెబ్బే! ఏం మనుషులు!"

అనుకుంటూనే థియేటరు వద్దకు చేరుకుని వాచీ చూసుకున్నాడు ఆనందరావు.

టైం దాటిపోయిందనుకుంటూ బుకింగ్ వద్దకు వెళ్ళి మూసివున్న కిటికీ చూసి తెల్లబోయాడు.

ఫస్టు క్లాసు బుకింగ్ మాత్రం తెరచివుంది.

జేబులు తడుముకొని తన దగ్గర అంత డబ్బు లేదని తేల్చుకున్నాడు ఆనందరావు.

అమాంతం సూర్యనారాయణ మీదా, వాడి నల్ల మార్కెటు కబుర్లమీదా కోపం ముంచుకువచ్చింది.

వెధవ! వాడు దార్లో ఎదురవకపోతే ఇంత ఆలస్యం జరక్కపోను!

అయినా కొత్త పిక్చరు. జనం బాగా ఉంటారని తెలిసి కూడా కాస్త ముందుగా బయలు దేరాల్సింది తను.

కాని... కాని... ఎబ్బే! తన తప్పేం లేదు. తాను సకాలానికే బయలుదేరాడు. కాని, ఆ సూర్యనారాయణగాడి వల్లనే... ఆ నల్ల మార్కెట్ మహారాజ పోషకుడి వల్లనే తనకీ ఆల స్యమూ, ఆశాభంగమూనూ.

మండుతున్న కోపంతో యెదురుగా లేని సూర్యనారాయణను ఏం చెయ్యటానికీ వీలులేక నోట్లోని పాన్‌ను మరింత గట్టిగా నమిలి తుపుక్కున ఊసి ఇంటిముఖం పట్టేడు ఆనంద రావు.

కాళ్ళీడ్చుకుంటూ, సిన్మాహాలు కాంపౌండ్‌లోంచి బయటికి నడుస్తున్న ఆనందరావుకు 'టిక్కెట్ కావాలాండీ!" అన్న మాట సూర్యనారాయణ సంచిలోని పంచదారలా తియ్యగా తోచి వెనక్కి తిరిగేడు.

"సెకండ్ క్లాస్ టిక్కెట్టు సార్!" అంటూ చేతిలో ఓ టిక్కెట్టు ఆడిస్తూ నిల్చునున్నాడు ఒకడు.

"ఎంత? " అనడిగేడు ఆనందరావు సందేహంగా

' ఓ రూపాన్నర ఎక్కువిస్తే చాలు సార్! బుక్కింగ్ మూసేశారు గదాండీ! ఇదే ఆఖరు టిక్కెట్టు" అన్నాడు వాడు టిక్కెట్టు ఊపుతూ.

క్షణమాగి ఆలోచించాడు అప్పారావు.

ఆలోచిస్తూ దీపాల క్రింద మెరుస్తూన్న రంగురంగుల పోస్టర్లలోని తన అభిమాన తారల మొహాల్ని పరికించేడు.

మారు మాట్లాడకుండా జేబులోంచి డబ్బు తీసిచ్చి టిక్కెట్టు పుచ్చుకున్నాడు.

పుచ్చుకుని ఠీవిగా, దర్జాగా థియేటర్లోకి నడిచేడు ఆనందరావు.

*(1972)*

☆